

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 14వ కథ -

**ఆదివారం నాడు** కాల్ డ్యూటీలో ఉన్నాను. డ్యూటీ ఉన్న రోజు ఉదయమే లేచి, ఇంటి బయట డోర్ పక్కన ఉన్న టేబిల్ మీద కొంత సరంజామా సర్దుతాను. ఇంటి తాళాలు, కోటు, కళ్ళజోడు, నా స్టాంప్, కొంత మనీ, ఇవన్నీ! వెళ్ళే హడావుడిలో ఏదీ మర్చిపోకుండా.

హాస్పిటల్ నుండి వచ్చే ఫోన్లు రిసీవ్ చేసుకునేందుకు వేరే నంబరున్న ఫోన్ ఉంది. ఆ ఫోన్ ను మాత్రం పిల్లిపిల్లలా ఎక్కడికి వెళ్ళినా తీసుకెళ్తా. బాత్ రూం లో కూడా సబ్బు పెట్టుకోవడానికి చిన్న గూడు ఉన్న టైల్ ఉంటుంది కానీ మొబైల్ పెట్టుకునే టైల్ ఇంకా ఎందుకు తయారు చెయ్యలేదో? కిచెన్ లో కూడా పూలూ పళ్ళూ ఉన్న టైల్స్ ఉంటాయి కానీ , మొబైల్ పెట్టుకునే టైల్ కూడా అవసరమనిపిస్తోంది. వంటింటి గట్టు మీద . ఫోన్ పెట్టి పనిచేసుకుంటుంటే దానికి , జిడ్డు అంటుకుంటుంది. పొరపాట్న దాన్ని ఉడుకుతున్న పులుసులో పడేస్తే? దాన్ని తియ్యడానికి గభాల్న నేను చేత్తో తియ్యబోతే? ఇలాంటి ఆలోచనలతో వంటింట్లో పనిచేస్తున్నాను.

సాయంత్రం అయిదవుతోంది. అంతవరకూ ఒక్క కాల్ కూడా రాలేదు. ఒక పనిచేస్తే బెటర్. బాండీ తో ఉప్మా వండేసి ఫ్రిజ్ లో పారేస్తే సరి. ఇవాళ, రేపు, వీలుంటే ఎల్లుండిని కూడా కవర్ చెయ్యొచ్చనిపించి బాండీ పొయిమీద పెట్టాను. సరిగ్గా అయిదూ అయిదున్నరకు మొబైల్ మోగింది. కిచెన్ టవల్ తో చేతులు తుడుచుకుని ఫోన్ లో మాట్లాడాను. ఒక పేషంట్ షాక్ లో వచ్చిందని కబురు. పొయ్యి కట్టేసి, ఇంటికి తాళమేసి పరిగెత్తాను.

హాస్పిటల్ బయట ఎన్నడూ చూడనన్ని కార్లు కనిపించాయ్. లేబర్ రూం బయట బంధువులంతా గుమి గూడి ఉన్నారు. వాళ్ళను తప్పించుకుని లోపలికెళ్ళి చూస్తే , ఓ తెల్లటి అమ్మాయి టేబిల్ మీద పడుకుని ఉంది. అప్పటికే ఐ సి యు డాక్టర్లు ఆమె చుట్టూ ఉన్నారు. అసిస్టెంట్ డాక్టర్ చెప్తోంది. ఉదయం వాళ్ళ ఊరిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో సిజేరియన్ చేశారంట. రెండు మూడు గంటల తర్వాత విపరీతమైన నొప్పిగా ఉందని పేషంట్ గొడవ చేస్తుంటే ఇక్కడికి ఆంబులెన్స్ లో పంపించారట.

దగ్గరకెళ్ళి చూశాను.ఆమె మొహమంతా పాలిపోయి ఉంది. తన బాధేమిటో చెప్పలేకపోతోంది. మాట సరిగా రావడం లేదు. ఊపిరి కోసం కష్టపడుతోంది. బాధనీ, చెప్పలేకపోతున్న తన నిస్సహాయతనీ కలిపి చూపుగా మార్చి నా వంక ఆశగా చూసింది. కొత్తగా ఎవరో వస్తే , తన బాధ తీర్చడానికేనన్న ఆశ.

" నొప్పి డాక్టర్. చచ్చిపోతున్నాను. " ఆ మాటలోనే ఏదో ఒకటి చేసి తనని ఆ బాధ నుండి కాపాడమన్న విన్నపం కూడా ఉంది.

భుజం తట్టాను. పొట్ట చూస్తే నీళ్ళతో నిండిన బెలూన్ లా ఉంది. లోపల ద్రవం కదుల్తున్నట్టు తెలిసిపోతోంది. సిజేరియన్ తర్వాత చాలా అరుదుగా, రక్తనాళం ఏదైనా ఓపెన్ అయి, పొట్టంతా రక్తంతో నిండుతుంది. . వెంటనే పొట్ట ఓపెన్ చేసి ఆ రక్తనాళాన్ని

ముడెయ్యగలిగితే గానీ ఆ రక్త స్రావం ఆగదు. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. జూనియర్ డాక్టర్స్ అప్పటికే బ్లడ్ బాంక్ కు పరిగెత్తారట. పక్కనే ఉన్న స్కాన్ ప్రోబ్ పెట్టి చూస్తే లోపల నిండిన రక్తం కదులుతూ కనిపించింది. ఆపరేషన్ కు వెంటనే షిఫ్ట్ చెయ్యమని దాదాపు పరుగు తీస్తున్నట్టు వెళ్ళాము. ఓ పది నిముషాల తర్వాత పేషంట్ ఆపరేషన్ టేబిల్ మీద ఉంది. నొప్పి నొప్పి అంటూ విలవిలలాడుతోంది. శ్వాస అందక, గాలి పీల్చుకోవడం కోసం విశ్వ ప్రయత్నం చేస్తోంది. త్వరగా ఎనస్థీషియా ఇచ్చేస్తే బాగుండు, త్వరగా పొట్ట ఓపెన్ చెయ్యాలనీ, లీకవుతున్న రక్తస్రావాన్ని ఆపాలనీ, లోపల అందరం ఆత్రంగా ఉన్నాం. మేమనుకున్న పని చెయ్యడానికి ఒక్క పది నిముషాలు చాలు. అందరి మనసుల్లోనూ, తెలియని తొందర. ఏదో ఒకటి చేసేసి ఆమె ను కాపాడాలి.

మనమే ఏదో చేస్తున్నామని, చేయగలమని , పరిస్థితులు అన్నీ మన కంట్రోల్ లో ఉన్నాయన్న భ్రమ లోనే బ్రతుకు తుంటాము. ఆ భ్రమే లేకపోతే బతుకు సాగదేమో.

అందరిలోనూ, తొందర రక్తం ఇంకా తొందరగా పరుగులు తీస్తున్న సమయం లో ఆపరేషన్ టేబిల్ మీద ఆమె కొలాప్స్ అయిపోయింది. వెంటనే ఎనస్థీషియా డాక్టర్లు, త్వరగా రియాక్ట్ అయి ఆమెకు కృత్రిమ శ్వాసనందించారు.

మోనిటర్ చూస్తే, పల్స్ , బీపీ మామూలుగానే ఉన్నాయి. నేనూ , ఇంకో సీనియర్ సర్జన్ ఇద్దరం కలిపి ఆపరేషన్ చేశాము.

పొట్ట ఓపెన్ చేసి చూస్తే, లోపల దాదాపు రెండు లీటర్ల రక్తం ఉంది.

ఆపరేషన్ ముగిస్తూ పొట్ట క్లోజ్ చేస్తున్నపుడు, తెల్లగా పాలిపోయిన కణాలను కుడుతున్నట్లనిపించి, వాటికసలు జీవం ఉన్నదా అన్న అనుమానం వచ్చింది. గాయం నుండి వచ్చే రక్తం ఎరుపుగా కాక , చిక్కటి కుంకుమ రంగులో వస్తోంది., మోనిటర్ చూశాను. పల్స్ , బీపీ, మామూలుగానే ఉన్నాయి. ఏదో అనుమానం. ఈ అమ్మాయి రికవర్ అవుతుందా అన్న అనుమానం.

మామూలుగా అయితే, ఆపరేషన్ కాగానే , ఎనస్థీషియా డాక్టర్స్ ఆమెకు శ్వాసనందించే ట్యూబ్ తీసేస్తారు. ఆమె పరిస్థితి క్రిటికల్ గా ఉండడం వలన, అది తీసెయ్యకుండా అలానే ఉంచి ఆమెను ఐ సి యు కి తరలించారు. బాగ్ లో యూరిన్ ఎంత ఉందో అని చూస్తే , చాలా తక్కువ ఉంది. కొద్ది సేపైన తర్వాత వస్తుందిలే అని నన్ను నేను సమాధాన పరచుకున్నాను.

అప్పటికి రాత్రి తొమ్మిదవుతూ ఉంది. ఎనస్థీషియా డాక్టర్, నేను, సర్జన్ ఐసియూ డాక్టర్స్ అందరం కలిసి పేషంట్స్ తాలూకు బంధువులకు కేసు గురించిన వివరాలు చెప్పాలనుకున్నాం. కౌన్సెలింగ్ రూం కు వెళ్తుంటే, బంధువుల సముద్రం. అందరూ ఆత్రంగా. ఆశలు నింపుకున్న కళ్లతో చూశారు తప్ప మమ్మల్ని ఒక్కమాటా అడగలేదు. ఒకోసారి పేషంట్స్, వాళ్ళ తాలూకు మనుషులు ఏదైనా అంటేనే సంతృప్తిగా ఉంటుందేమో. . వాళ్ళ సంఖ్య, మౌనం చూస్తుంటే, కౌన్సెలింగ్ కనీసం గంటకు తక్కువ పట్టదనిపించింది.

ఇంతలో కొన్ని వివరాలు తెలిశాయి. పేషంట్ భర్త సిటీలో చాలా డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తి అని, అతనికి ఎన్నో వ్యాపారాలున్నాయని, ఆ గర్భం, పెళ్ళైన చాలా ఏళ్ళ తర్వాత వచ్చిందనీ!

పదిమందికి పైగా లోపలికొస్తారనిఎదురుచూస్తుంటే పేషంట్ భర్త ఒక్కడే వచ్చాడు. అతనితో పాటు ఇంకెవరో పెద్దాయన.

మా ఎదురుగా కూర్చున్నాడు.

“మిగతా బంధువులను, దగ్గరి వాళ్లని కూడా పిలవండి.” అన్నాను.

నాకొక్కడికే చెప్తే చాలన్నాడు.

మా సీనియర్ “ఆపరేషన్ చేశాము, రేపటికి గానీ ఏదీ చెప్పలేము. . రక్తం కావల్సి ఉంటుంది. మీలో ఎవరైనా వెళ్ళి బ్లడ్ బాంక్ లో డొనేట్ చెయ్యాలి.”అన్నారు.

ఎన్నో ప్రశ్నలకు తయారయి వచ్చాము కానీ అతనేమీ అడగలేదు. నమస్కారం పెట్టి బయటికి వెళ్ళిపోయాడు.

ఒక గంటలోనే నలభై మంది బంధువులు రక్త దానం చేశారు.

తర్వాత ఐ సి యు కు వెళ్ళి పేషంట్ ను చూశాము. మోనిటర్ లో అన్నీ శబ్దాలు వినిపిస్తున్నా, శబ్దాలు ఊరటనివ్వలేకపోతున్నాయి.

ఇంటికెళ్లాను. స్నానం చేసి ఏదో తినేసి టీవీ పెట్టాను. కాసేపైన తర్వాత, ఆలోచించుకోవడానికి బొత్తిగా ప్రశాంతత లేకుండా ఇల్లంతా ఏంటీ గోల అనిపించి టీవీ కట్టేశాను.

చెప్పులేసుకుని , కోటుతీసుకుని బయటకొచ్చాను.

డా. మైఖేల్ భార్య తన స్నేహితురాళ్ళతో కలిసి రాత్రిపూట వాకింగ్ చేస్తారు. దానిలో భాగంగా ఓ చెట్టుకింద నిల్చుని చర్చించుకుంటున్నారు. నన్ను కూడా కలవమని పిలిచారు. "ఇదిగో ఇప్పుడే వస్తాను" అని వాళ్ళతో చెప్పి హాస్పిటల్ వైపు అడుగులు వేస్తున్నాను. అడుగుల్లో ఎప్పుడూ ఉండే తొందర లేదు. గమ్యం చేరుకోవడం ఇష్టం లేని ప్రయాణం లాగా , చాలా సేపు నడిచి ఐ సి యు లోపలికి వెళ్ళాను. నర్సులందరూ ఎంతో బిజీగా ఉన్నారు. నేను ఆ పేషంట్ బెడ్ దగ్గర నిల్చున్నాను.

అప్పటికి ఆపరేషన్ చేసి రెండు మూడు గంటలయింది.యూరిన్ బాగ్ లో యూరిన్ కోసం చూశాను. బాగ్ లో యూరిన్ కూడా రెండు మూడు చుక్కలుంటుందేమో. కాళ్ళు చల్లబడ్డాయి. ఐ సి యు చలి వణికిస్తోంది. ఆ అమ్మాయి రికవర్ అవుతుందా అన్న అనుమానం పట్టి పీడిస్తోంది. నాదంతా వట్టి అనుమానమని మోనిటర్ శబ్దాలు గోల గా చెప్తున్నాయి.

అప్పటికి అర్థ రాత్రి అయ్యుంటుందేమో. కారిడార్ లో ఎవరూ లేరు. దూరంగా విజిటర్స్ కోసం వేసిన మెటల్ సోఫాలో ఎవరో ఉన్నారు. అటువేపు వెళ్ళి చూస్తే , పేషంట్ భర్త కూర్చున్నాడు. దూరంగా ఎవరో ఆడవాళ్ళు ఆ సోఫాల్లో పడుకుని నిద్రపోతున్నారు. అతని పక్కనే అప్పుడే పుట్టిన బిడ్డ.

'గుమ్మడి పండు లాంటి బిడ్డ' అనే మాట ఎందుకొచ్చిందో చెప్పే బిడ్డ. పైనున్న లైట్ల వంక చూస్తున్నాడు. ఇంకోవైపు పిల్లాడికి కావల్సిన సరంజామా ఉంది. నేనటుగా రావడం చూసి పిల్లవాణ్ణి సోఫాలో ఉంచి రాబోతుంటే నేనే వెళ్ళాను. నాదగ్గర ఏదో మంచి కబురుందని ఆత్రంగా చూస్తున్నాడు. అతన్ని తప్పించుకుని వెళ్ళకుండా నేను అటెందుకెళ్ళానో.

"బాబుని నర్సరీ లో ఉంచొచ్చు. మీరిలా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు" అన్నాను.

"రండి, నేనువెళ్ళేదటువైపే" అంటూ ఆ ఏర్పాటు చెయ్యడానికి అతన్ని తీసుకెళ్తున్నాను. బాబుని ఎత్తుకుని అతను నడుస్తున్నాడు. అంత ఐశ్వర్యవంతుడు అలా బాబుని పట్టుకుని కూర్చోవాల్సిన అవసరమేమిటో అర్థం కాలేదు.

"బాబుని చూసేందుకు ఎవరూ లేరా. ఎవరికైనా ఒప్పజెప్పకపోయారా?"

అతనేమీ మాట్లాడకుండా తలూపాడు. అవుననో, కాదనో అర్థం కాలేదు.

నాతో నడుస్తున్నాడు. అతని భార్య గురించి ఏదో ఒకటి చెప్పాలి. ఏం చెప్పాలీ అని ఆలోచిస్తున్నాను. నర్సరీ లో బాబుని ఒప్పజెప్పి బయటికొచ్చాము.

"పరిస్థితి అలాగే ఉందండీ." అన్నాను.

భార్య పరిస్థితి కి రియాక్ట్ అయే మగవాళ్లనే ఎక్కువగా చూస్తుంటాను. భార్య మీద ఎంత ఆధారపడి ఉంటారో, ఆమె లేకపోతే ఎలా బతకాలోనన్న భయం , కంగారు వాళ్లలో కనిపిస్తుంటాయి.

ఇతడి ముఖం లో వేరే భావాలు. సర్వం కోల్పోయిన వ్యక్తిలో కనిపించే దిగులు, మనసుని పిండేసేంత నిర్వేదమూ ఉన్న...గాజు కళ్ళు.

" రేపు చూద్దాం . మీరు కొంచం విశ్రాంతి తీసుకోండి ."

ఫ్లాట్ కి తిరిగి వచ్చి నిద్రపోయాను. దేవుడిచ్చిన అదృష్టమో , లేక ఇవాళ నిద్రపోకపోతే, రేపు పనికి ఇబ్బంది అవుతుందని నాకు నేను చేసుకున్న ఏర్పాటో తెలియదు , కొన్నేళ్ళనుండీ, ఇక నిద్రపోవాలి అనుకోగానే నిద్రవస్తుంది.

బాగా పనిచేసిన రోజునే ఆ సౌభాగ్యం. అన్ని రోజులూ కాదు.

రేపే జరుగుతుందో తెలియనపుడు, జరగబోయేదాన్ని మార్చడం మనచేతుల్లో లేనపుడు ఆలోచించడం అనవసరం.

జీవితం సగం గడిస్తే గానీ, ఇలాంటి సత్యాలు ఒకటో అరో బోధపడవు.

నాలుగేళ్ళు గడిచాయి.

రాత్రి పూట కాల్ వస్తే, నిద్రలేచి పరుగులు తీస్తూ వెళ్ళాలంటే 'ఇదేం జీవితం రా భగవంతుడా' అనిపిస్తుంది కానీ వెళ్లాక, అక్కడ కూర్చోడానికి, మంచినీళ్ళు తాగడానికి కూడా టైం లేకుండా బొంగరాల్లా తిరుగుతున్న జూనియర్ డాక్టర్లను చూస్తే, సీనియర్ గా ఉండడం ఎంత అదృష్టమో తెలిసి వస్తుంది. రేగిపోయిన జుట్టు, నలిగిన చూడీదార్లు వేసుకుని, టెన్షన్ తప్ప ఇంకో ఎక్స్ప్రెషన్ తెలియని ముఖాలతో చక్కని లేడీ డాక్టర్లు ఇరవైనాలుగ్గంటలూ పరుగులు తీస్తుంటారు.

“ఏమిటి సంగతి?”

“కన్సెంట్ ఇవ్వనంటోంది మేడం.”

ఒకమ్మాయికి ఆపరేషన్ అవసరమైంది. అనుమతి ఇవ్వడానికి గొడవ చేస్తుందట.

వెళ్లాను. మూడో కాన్పు. మొదటి రెండూ మామూలుగానే డెలివరీ అయింది. ఆ ఇద్దరు పిల్లలు నాలుగేళ్ళ వయసులో యాక్సిడెంట్ లో. ఇప్పుడు మాత్రం కాన్పు సగం లో ఉండగా బ్లీడింగ్ అవుతోంది. బిడ్డ హార్ట్ రేట్ గ్రాఫ్ హెచ్చుతగ్గులు చూపిస్తూ హడావుడి చేస్తోంది.

పరిస్థితి వివరించాను.

సంతకం పెట్టడానికి అభ్యంతరం లేదంది.

మరింకేమిటి అన్నట్టు అసిస్టెంట్ వంక చూశాను.

“ట్యూబెక్టమీ కూడా కలిపి చేస్తేనే పెడతానంటుంది మేడం” అంది ఆ అమ్మాయి.

"ఈ బిడ్డ పరిస్థితి అంతగా బాగాలేదమ్మా, ఇదివరకు పుట్టినవాళ్ళు కూడా లేరు. ఇప్పటికిప్పుడు ఫామిలీ ప్లానింగ్ ఎందుకు చెప్పు. కావాలంటే ఎన్నో సాధనాలున్నాయి. "

అని ఎన్నో రకాలుగా చెప్పి చూసినా వినలేదు. ట్యూబెక్టమీ చేస్తానంటేనే సిజేరియన్ కు సంతకం పెడతానంది.

వాళ్ళ వాళ్ళెవరితోనైనా చెప్పించకపోయారా?

భర్త , తల్లి ఇప్పటివరకూ ప్రయత్నం చేశారనీ, బయటే ఉన్నారనీ చెప్పింది.

ఓ పక్కన బ్లీడింగ్, ఇంకోపక్క పడిపోతున్న హార్ట్ రేట్, వేరే గత్యంతరం లేక ఆమె కోరుకున్నట్లే చేస్తామని చెప్పి , ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్ళారు.

తర్వాత రోజు ఆమెను చూద్దామని వెళ్ళాను.

అప్పటికే లేచి, బెడ్ మీద వెనక పెట్టిన దిండ్లకు ఆనుకుని కూర్చుంది. ముఖం తేటగా ఉంది. పక్కనే ఉయ్యాల్లో చిన్న పాప నిద్రపోతోంది.

పక్కనే తల్లి బాబోలు ఒక పెద్దావిడ పుట్టిన పాపను ఎత్తుకుని ఉంది.

ఎలా ఉందో రొటీన్ ప్రశ్నలయాక అడిగాను.

“రాత్రి ఎందుకంత గొడవ చేశావు? బిడ్డ కు ఏ సమస్యా లేదు కాబట్టి సరిపోయింది.”

తలొంచుకుంది. ఏం మాట్లాడలేదు. ప్రశాంతంగా ఉంది ఆమె ముఖం.

ముందు పుట్టిన బిడ్డలు ఎలా పోయారో, కారణమేమిటో, కేస్ షీట్ వెదికాను. వివరాలేం లేవు. ఆమె తల్లిని పక్కకు పిలిచి అడిగాను.

"రాత్రి పూట ఇది వంటింట్లో ఏదో పని చేసుకుంటా వుందంట. వాళ్ళు వేరే రూం లో పడుకున్నారమ్మా. పిల్లలున్న రూం లో ఏ సీ నుండి మంటలొచ్చి రూమంతా అంటుకుంది. ఏంటా వాసన అని ఇదెళ్ళి చూసేసరికే గదంతా మంటలు. పిల్లల్ని చూసుకోకుండా ఏం చేస్తన్నావని అల్లుడింట్లో నుండి ఎళ్ళగొట్టి, వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. దీని తప్పేముంది చెప్పండి.”

ఆవిడ చెప్తూ ఉంటే మనసొక్క సారిగా కుదుపుతిన్నట్టైంది.

ఏమిటీ ఘోరం.

అతనింటినుండి బయటకి వచ్చే సమయానికి ఈ అమ్మాయి గర్భవతి అయ్యుంటుంది. .'

కానీ , ట్యూబెక్టమీ ఎందుకు అడిగిందో అర్థం కాలేదు.

ఏమని అడుగుతాను. బయటికి వచ్చేస్తుంటే ,

ఓ చిన్న పిల్లవాడితో కలిసి ఒకతను వచ్చాడు.

“నమస్తే మేడం బాగున్నారా?” పలకరించాడు.

నమస్కారం పెట్టి తలూపి బయటకు వచ్చాను. నాతో బాటే అతను కూడా .

“ఎంతో మందిని చూస్తుంటారు. నేను గుర్తు లేననుకుంటాను. వసంత లక్ష్మి భర్తని.”

వసంత లక్ష్మి. ఎప్పటికీ మరిచిపోలేని పేరు!

వళ్ళంతా జల్లుమని చల్లబడినట్లనిపించింది.

నన్ను బ్రతికించు అని కళ్ళతో ప్రాధేయ పడ్డ వసంత లక్ష్మి.

ఆపరేషన్ టేబిల్ మీద కొలాప్స్ అయి, ఐ సి యు లో వెంటిలేటర్ మీద ఉండి చనిపోయిన అమ్మాయి.

“మీరా? “

ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడా?

“రాత్రి శారద బాగా గొడవ చేసిందంటకదా. సారీ మేడం.”

అతను చెప్పుకుంటూ పోతున్నాడు.

" తనకు పిల్లలు పుడితే బాబుని చూసుకోదేమోనని అమ్మ పెళ్ళి టైం లో చాలా కండిషన్స్ పెట్టింది.

అమ్మ ఇప్పుడు లేదనుకోండి. అనుకోకుండా ఈ ప్రెగ్నన్సీ వచ్చింది. మాట తప్పానని ... శారద ప్రెగ్నెన్సీ వచ్చినదగ్గర్నుండీ కొంచం ఇదవుతూ ఉంది."

“అలాగా?”

బాబు ని చూద్దామని లోపలికెళ్ళాను.

పేషంట్ బెడ్ పక్కనే నుంచుని , ఆమె ముఖం పక్కనే తన ముఖం ఉంచి ఏవో కబుర్లు చెప్తున్నాడు బాబు.

బాబు బుగ్గలు తడుముతూ పేషంట్ అతనితో ఏదో చెప్తోంది. గీస్తే చక్కటి చిత్రమయేంత బాగుంది ఆ దృశ్యం.

ఆరోజు ఐ సి యు ముందు నేను చూసిన  బాబు.  తెల్లని పైజమా లాల్చీ వేసుకుని ఉన్నాడు, పెద్దైన గుమ్మడి పండు. తను పుట్టిన రోజున, తల్లిని చూడలేకపోయినా ఇప్పుడు చూస్తున్నాడు.

బాబు ని చూస్తే లోపలేదో తెలియని భావం పొంగింది. మమకారం అనే పదానికి  'మన' అవసరమా?

బాబుని దగ్గరకు తీసుకుని పలకరించాను.

" చెల్లిని చూశావా?"

తలూపాడు.

"బాగుందా?"

"చాలా బాగుంది."

"నీకంటేనా?"

"ఊ..నాకన్నా బాగుంది. అదే నాక్కావాలి."  అన్నాడు.

ఈ మధ్యన చాలా మంది పిల్లల్ని చూస్తున్నాను. పెద్ద వాళ్లలా మాట్లాడతారు.

అర్థం చేసుకునే వయసు లేకపోతేనేమి,  అర్థవంతమైన మాటలే  మాట్లాడతారు.

*(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)*

Post your comments